

'ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం'

యాచారం, జనవరి 27 : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పేద, మధ్య తరగతి ప్రజలు నరకం అనుభవిస్తున్నారని, పదేళ్లుగా కేంద్రం రైతుల గోడును పట్టించుకోవడంలేదన్నీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న కార్మిక, కర్షకుల సంఘాల ఆధ్వర్యంలో భారత్‌బంద్ నిర్వహిస్తామన్నారు. శనివారం యాచారంలో భారత్ బంద్ కరపత్రాలను విడుదల చేశారు. ధరల నియంత్రణలో కేంద్రం విఫలమైందన్నారు. ప్రతీ వ్యక్తికి 200రోజుల ఉపాధి కల్పించి రూ.600 దినసరి వేతనం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కాశింబౌలి గ్రామ సమీపంలో ఆహ్లాదకరంగా ఉన్న చేమంతి తోట

పుష్ప సోయగం!

నిండా చేమంతి పూలతో కళకళలాడుతున్న పూదోట ఒకవైపు, రోడ్డు పక్కన ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నట్టుగా ఉన్న పూలచెట్లు మరో వైపు కనువిందు చేస్తున్నాయి. మొయినాబాద్ మండలం బాకారం జాగీర్--కాశీంబౌళి రోడ్డుకు అనుకొని ఓ వ్యవసాయ క్షేత్రంలో చేమంతి తోట ఆహ్లాదకరంగా కన్పిస్తోంది. అలాగే యాచారం మండలం నజ్దిక్ సింగారంలో రోడ్డు వెంట పలు చోట్ల చెట్లకు లేత గులాబీ రంగులో పూత కన్పిస్తోంది. ఆకులు లేకుండా చెట్టు నిండా పూత విరబూపి బాటసారులకు కనువిందు చేస్తున్నాయి.

- మొయినాబాద్ రూరల్/ యాచారం, జనవరి 27



నజ్దిక్‌సింగారంలో గులాబీ రంగు పూలు పూసిన చెట్టు

కొన్నది కొంతే!

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ అంతంత మాత్రమే



- 87వేల టన్నులు సేకరించాలని లక్ష్యం
- సేకరించింది 10,016 టన్నులే
- ముగిసిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ
- ప్రభుత్వ ధర కంటే ప్రైవేట్‌లోనే అధికం
- వ్యాపారులకు అమ్మేందుకే రైతుల మొగ్గు
- నానాటికీ ప్రహసనంగా మారుతున్న కొనుగోలు కేంద్రాల నిర్వహణ

ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ లక్ష్యం ఏటేటా నీరుగారుతోంది. మొన్నటి వానాకాలంలో నిర్దేశించుకున్న లక్ష్యంలో 30శాతానికి మించి కొనుగోలు చేయలేకపోయారు. మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ రేటు చెల్లించడం, కొనుగోళ్లలో షరతులు విధించకపోవడం, అమ్మిన వెంటనే డబ్బులు చెల్లించడం వంటి కారణాలతో రైతులు వ్యాపారుల వైపు మొగ్గు చూపారు. ఇదిలా ఉంటే వానాకాలంలో కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మిన రైతులకు ఇంకా ప్రభుత్వం రూ.3కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది.

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జనవరి 27): జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ఈ సారి అంతంత మాత్రంగానే సాగింది. కొండంత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా సేకరించింది మాత్రం గోరంతే! అంచనాలకు మించి వరి దిగుబడి వచ్చినా.. సేకరణలో అధికారులు విఫలమయ్యారు. అలాగే కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధర కల్పించడం, కొనుగోళ్లలో షరతులు విధించకపోవడం, అమ్మిన వెంటనే డబ్బులు చెల్లించడం వంటి కారణాలతో సైతం రైతులు కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపలేదు. కొనుగోలు కేంద్రాల్లో ఇచ్చే ధర సరిపోకపోవడం, కేంద్రాల్లో సదుపాయాలు కల్పించకపోవడం. మిల్లర్లు ధాన్యంలో కోత పేరిట దోపిడీ తదితరాల కారణంగానూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తేలేదు. బహిరంగ మార్కెట్‌లో ఈ సారి వడ్లకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ మద్దతు ధర కంటే ప్రైవేట్‌లో గిట్టుబాటు కావడంతో ఎక్కువ మంది రైతులు వ్యాపారులకే అమ్మారు. ధరతో పాటు సకాలంలో డబ్బులు చెల్లించడం, వ్యాపారులే ఇళ్ల వద్దకు వచ్చి కాంట వేసుకోవడంతో రైతులకు రవాణా ఖర్చుల భారం తగ్గింది. వ్యాపారులు నేరుగా రైతుల కల్లాల వద్దకే వచ్చి వడ్లను కొన్నారు. ఆ వెంటనే డబ్బు చెల్లించారు. తరుగు తీయలేదు. ప్రభుత్వం గ్రేడ్-ఎ రకానికి క్వింటాలుకు రూ.2,203 చెల్లిస్తుంది. అదే వ్యాపారులు క్వింటాలుకు రూ.3,100 చెల్లించారు. దీంతో చాలా మంది రైతులు వ్యాపారులకు వడ్లు అమ్మారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెలబోయాయి.

2032-24 వానాకాలం ధాన్యం కొనుగోళ్ల వివరాలు	
సేకరించాల్సిన ధాన్యం	: 87,582 టన్నులు
కొనుగోలు కేంద్రాలు	: 33
సేకరించిన ధాన్యం	: 10,016టన్నులు (విలువ రూ.22 కోట్లు)
మొత్తం రైతుల సంఖ్య	: 1,618
రైతులకు చెల్లించినది	: రూ.18కోట్లు
చెల్లించాల్సింది	: రూ.3కోట్లు
మద్దతు ధర క్వింటాలుకు (గ్రేడ్-ఎ)	: రూ.2,203
వానాకాలం వరి సాగు (ఎకరాల్లో..)	
సాధారణ విస్తీర్ణం	: 79,215
సాగైన విస్తీర్ణం	: 1,32,559

ఈ సారి సేకరించింది 10,016 టన్నులే!

సారి వానకాలం వరి సాగు సాధారణ విస్తీర్ణం 79,215 ఎకరాలు కాగా జిల్లాలో 1,32,559 ఎకరాల్లో వరి వేశారు. సాగు విస్తీర్ణాన్ని పరిగణలోకి తీసుకొని 87,582 టన్నుల ధాన్యం సేకరించొచ్చని అధికారులు అంచనా వేశారు. ఇందుకు గాను 33 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. డీసీఎంఎస్ నిర్వహించిన 10 కొనుగోలు కేంద్రాల్లో 967మంది రైతుల నుంచి 6,136.48టన్నుల వడ్లు సేకరించారు. ప్యాక్స్‌ల ద్వారా 21 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 524మంది రైతుల నుంచి 3,240 టన్నుల ధాన్యం సేకరించారు. అలాగే రెండు ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా 127మంది రైతుల నుంచి 639 టన్నులు సేకరించారు. ఇలా 33 కొనుగోలు కేంద్రాల్లో 10,016 టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యంలో సగం కూడా కొనలేదు. కాగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ఏటేటా తగ్గుతోంది.

ఈ సారి వడ్లు వ్యాపారికే అమ్ముకున్నా



ప్రభుత్వ మద్దతు ధర కంటే ప్రైవేట్‌గా అమ్ముకుంటే క్వింటాలుకు వెయ్యి రూపాయలు ఎక్కువ వచ్చాయి. గత ఏడాది ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాను. అధికారులు చాలా రోజుల పాటు డబ్బులివ్వక ఇబ్బంది పడ్డాను. ఈ సారి నేను రెండెకరాల్లో వరి వేశాను. 80 బస్తాల పంట వచ్చింది. వ్యాపారికి అమ్మగా వెంటనే డబ్బులిచ్చారు. ధర కూడా ఎక్కువే ఇచ్చాడు.

- బంగారు అంజయ్య, రైతు, తుమ్మలపల్లి

ప్రైవేటులోనే గిట్టుబాటైంది



గతేడాది వరి వేసి నష్టపోయాను. దిగుబడి రాలేదు. వచ్చిన వడ్లను కొనుగోలు కేంద్రానికి తరలిస్తే తేమశాతం.. తాలు అని కొర్రీలు కొనేందుకు పెట్టారు. దీంతో నేను ధాన్యం అమ్మేందుకు నానా అవస్థలు పడ్డాను. మొన్నటి వానకాలంలో 11ఎకరాల్లో వరి వేశాను. 300 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రైవేట్ వ్యాపారులు పొలం వద్దకే వచ్చి వడ్లు కాంట పెట్టుకున్నారు. క్వింటాకు రూ.3,100 చెల్లించారు.

- అంకం పాండు, రైతు, లక్ష్మీదేవిపల్లి, చౌదరిగూడ మండలం

రైతులకు రూ.3కోట్ల బకాయిలు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులు డబ్బు కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు రూ.18కోట్లు రైతులకు చెల్లించారు. ఇంకా రూ.3కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ధాన్యం డబ్బులను త్వరగా ఖాతాల్లో జమ చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా కాంట వేసిన 15 రోజుల్లో రైతు ఖాతాల్లో డబ్బు వేస్తామని చెప్పిన అధికారులు మాట నిలబెట్టుకోలేదు. నెల గడుస్తున్నా చాలా మంది రైతులకు ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు.

రామరాజ్యం ప్రారంభం

- ప్రతీ ఒక్కరు నిత్యం రాముడిని స్మరించుకోవాలి
- చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్



ఆలయంలో భక్తులతో మాట్లాడుతున్న పూజారి రంగరాజన్

మొయినాబాద్ రూరల్, జనవరి 27 : ఎన్నో ఏళ్ల నిరీక్షణ, పోరాటాల తర్వాత మన రాముడు అయోధ్యలోని దివ్య మందిరంలో కొలువుదీరాడని, అప్పటి నుంచి మనకు రామరాజ్యం ప్రారంభమైందని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్.రంగరాజన్ అన్నారు. ఇక నిత్యం ఆ మర్యాదపురుషోత్తముడిని స్మరించుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. భక్తుల కొంగుబంగారంగా భావించే చిలుకూరు బాలాజీ ఆలయానికి శనివారం భక్తులు తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసిన దర్శనాన్ని కల్పించారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ.. 500వందల ఏళ్లనాటి కల సాకారమైందని, అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠాపన జరగడం మనందరి విజయమన్నారు. అయోధ్య వివాదాన్ని పరిష్కరించిన న్యాయవ్యవస్థకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతొక్కరూ పాటించాలని సూచించారు.

భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 27:ప్రభుత్వ భూములు కబ్జాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.శశాంక తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రభుత్వ భూముల పరిరక్షణపై తహసీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పర్యవేక్షణ నిరంతరాయం చేయాలని, కబ్జాదారుల మీద చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తుది ఓటరు జాబితాకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించి ఈ నెలాఖరుకల్లా పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ శశాంక అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితాను ఫిబ్రవరి 8న ప్రకటించనున్న సందర్భంగా మార్పులు చేర్పులు సవరణలు అన్నింటినీ ఈ నెల చివరికి పూర్తిచేసి పారదర్శక ఓటరు జాబితాను రూపొందిస్తామన్నారు. జిల్లాలో స్వీప్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి 18సంవత్సరాలు నిండినవారినందరినీ ఓటరుగా నమోదు చేయించామని తెలిపారు. సమ్మర్ స్పెషల్ రివిజన్‌లో ఈ నెల 22 వరకు వచ్చిన దరఖాస్తులన్నీ ఈ నెలాఖరుకల్లా పరిష్కరించి ఓటరు జాబితా రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం





రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలను కలిసిన పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఎ.సత్యనారాయణ తదితరులు

- ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం.. ఆలయ భూముల పరిరక్షణకు సీఎం కృషి
- మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

కందుకూరు, జనవరి 27: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదిసంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు విసిగి పోయారని, ప్రజాప్రభుత్వం(కాంగ్రెస్)లో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ అన్నారు. శనివారం పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుడు ఎ.సత్యనారాయణ నగరంలోని మంత్రుల నివాసాల్లో విడివిడిగా వారిని కలిసి మహేశ్వరం సమస్యలపై వివరించారు. వారితో మంత్రులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పులిమామిడి చీకటి వేంకటేశ్వర ఆలయ భూములును పరిరక్షించి ఆలయాభివృద్ధికి సహకరిస్తామని మంత్రులు హామీ ఇచ్చారు. ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేలా సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణ రూపొందించారని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్లే గ్రామాలకు బస్సులను రద్దుచేశారని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం జంగారెడ్డి ధరణి పోర్టల్ ప్రక్షాళనపై కోదండరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న మొగులయ్య

ఇబ్రహీంపట్నం, జనవరి 27 : ట్రాఫిక్ నిబంధ నలు పాటించకే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కిన్నెర వాయిద్య కళాకారుడు, పద్మశ్రీ అవార్డీ మొగులయ్య అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్ చేయొద్దని, అధిక వేగంతో వాహనాలు నడపొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలే అన్నారు. ట్రాఫిక్, సివిల్ ఎస్సైలు వెంకటయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్

- సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్యే తీగల
- ఆయన దారిలోనే కోడలు జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి?
- జడ్పీ పీఠాలపై కాంగ్రెస్ కన్ను
- అదే రీతిలో మున్సిపల్ కౌన్సిళ్లు, కార్పొరేషన్ల హస్తగతానికి స్కెచ్
- నాతో పాటు ఇంకా పెద్ద నేతలే వస్తున్నారు : తీగల కృష్ణారెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో తీగల కృష్ణారెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనవరి 27): పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండడంతో అధికార కాంగ్రెస్ చేరికలపై దృష్టిసారించింది. ప్రతిపక్ష బీఆర్ఎస్‌లోని ముఖ్యనేతలను, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులే టార్గెట్‌గా 'ఆపరేషన్ ఆకర్ష్' మొదలు పెట్టింది. కీలక నేతలతో మంతనాలు మొదలు పెట్టింది. దీని పర్యావసానంగా మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ నగర మాజీమేయర్ తీగల కృష్ణారెడ్డి బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చారు. శనివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఆయన మీర్‌పేటలో బహిరంగసభ నిర్వహించి అక్కడ సీఎం సమక్షంలో పార్టీలో చేరేందుకు ముహూర్తం నిర్ణయించుకున్నారు. కేసీఆర్ కుటుంబం తనను మోసం చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నాతో పాటు ఇంకా అనేక మంది పెద్దనేతలు కాంగ్రెస్‌లో చేరబోతున్నారని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే రేవంత్‌రెడ్డిని కలిసే ముందు తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి మంత్రి కొండా సురేఖను కలిశారు. తరువాత కృష్ణారెడ్డి మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆ సమయంలో ఆయనతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కనిపించలేదు. అయితే ఉద్దేశపూర్వకంగానే ఆమె దూరంగా ఉన్నారా? అనేది తెలియడం లేదు. అయితే తీగల అనుచరులు మాత్రం ఆయన కోడలు అనితారెడ్డి కూడా మామ బాటలోనే నడుస్తారని చెబుతున్నారు. ఒకవేళ అదే జరిగితే రంగారెడ్డి జడ్పీ పీఠం కాంగ్రెస్‌పరం కావడం ఖాయం. అయితే పార్టీ మార్పుపై అనితారెడ్డి మనసులో మాట బయటకు చెప్పడం లేదు. నర్మగర్భంగానే మాట్లాడుతున్నారు. ఇప్పటికే మేడ్చల్ జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఇప్పుడు రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ కూడా కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమనే చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇక వికారాబాద్ జడ్పీపీఠంపై అధికార కాంగ్రెస్ కన్నేసింది. ప్రస్తుతం ఇక్కడ మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య సునీతారెడ్డి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. వీరిద్దరితో కూడా కాంగ్రెస్ నేతలు కొన్నాళ్లుగా సంప్రదింపులు జరుపుతున్నారు. పార్లమెంట్ షెడ్యూల్‌కు ముందుగానే రంగారెడ్డి, వికారాబాద్ జడ్పీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా అధికార కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. మెజార్టీ జడ్పీ సభ్యులను పార్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. వీటితో పాటు మున్సిపల్, కార్పొరేషన్లను హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది.

మా ఓట్లను తొలగించొద్దు

- డీటీ, ఆర్ఐలకు కాకునూర్ ఓటర్ల వినతి

కేశంపేట, జనవరి 27:కాకునూర్‌లో ఉన్న తమ ఓట్లను తొలిగించొద్దని గ్రామ ఓటర్లు ఓటర్లు డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్ఐ నివేదితకు శనివారం వినతిపత్రం ఇచ్చారు. 175 మంది ఓటర్లు కాకునూర్‌లో ఉండడం లేదని, వారి ఓట్లను తొలిగించాలని గ్రామ యువజన సంఘాల సభ్యులు గతంలో ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఓట్ల తొలిగింపుపై ఈ నెల 29కల్లా వివరణ ఇవ్వాలని నోటీసు ఇచ్చారన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో కాకునూర్ ఓటరు జాబితాపై విచారణ చేస్తామని అధికారులు వారికి తెలిపారు. గ్రామస్తులు జగదీశ్వర్‌గౌడ్, జంగారెడ్డి, కోటేశ్వర్, కృష్ణ, అక్బర్, నర్సింలుగౌడ్, హనీఫ్, నీల్యా, మహమూద్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి

షాద్‌నగర్ రూరల్, జనవరి 27: ఎరువుల దుకాణాల డీలర్లు ఎల్లప్పుడూ ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి సూచించారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను శనివారం ఆమె తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. ప్రతీ డీలరు ఆధార్ కార్డు ఆధారిత వేలిముద్ర (ఈపీఓఎస్) మిషన్ ద్వారానే రైతులకు ఎరువులు విక్రయించాలని, రైతులకు రసీదు ఇవ్వాలన్నారు. ఆమె వెంట ఏఓ నిషాంత్‌కుమార్ ఉన్నారు.



ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న గీతారెడ్డి

రెండు కిలోల గంజాయి పట్టివేత

● ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములు

కొడంగల్ రూరల్, జనవరి 27: గంజాయిని తరలిస్తుండగా శని వారం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని రావుల్‌పల్లి చెక్ పోస్టు సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని రావుల్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలో ఎస్సై భరత్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్, కానిస్టేబుళ్లు నరేందర్‌రెడ్డి, కృష్ణ, బాబు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం మోదిన గ్రామానికి చెందిన హుసేనప్ప, నాగరాజు, కొడంగల్ మండలంలోని రావుల్‌పల్లి గ్రామానికి చెందిన దస్తప్పలు కర్ణాటక నుంచి కొడంగల్‌కు వస్తుండగా వారి బైక్‌ను తనిఖీ చేశారు. ఓ బ్యాగులో రూ.40వేల విలు వైన రెండు కిలోల గంజాయి పట్టుబడింది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని కొడంగల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిం చారు. ఆరు నెలలుగా కర్ణాటక నుంచి కొడంగల్‌కు తరలించి పరిసర ప్రాంతాల్లో కిలో గంజాయి రూ.20వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాములు చెప్పారు. గంజాయితో భవిష్యత్తును ఆగం చేసుకోవద్దని అన్నారు.

ఆదిభట్ల సీఐగా రాఘవేందర్ రెడ్డి



ఆదిభట్ల, జనవరి 27 : ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.రఘువీర్‌రెడ్డి కుషాయిగూడ ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్గొండ జిల్లా మల్లెపల్లి పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేస్తున్న ఎస్.రాఘవేందర్‌రెడ్డి ఆదిభట్లకు బదిలీపై వచ్చారు. ఈమేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో స్నేహపూర్వకంగా పనిచేస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ముందుకు సాగుతామన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి అధిక ప్రాధాన్యతనిస్తామన్నారు.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం



చేవెళ్ల, జనవరి 27 : చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ ఇటీవల సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల అధ్యాపకులు, చేవెళ్ల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు. ఆమెకు అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. అధ్యాపకుడు శేషాద్రి, ఉపాధ్యాయులు సుధాకర్, ఎం.సంతోషి తదితరులు తదితరులున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మండల సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, జనవరి 27: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలో శనివారం ఎంపీపీ ప్రియాంకశివశంకర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు లోటురాకుండా నిధులు మంజూరు చేస్తుందన్నారు. అధికారులు గత ప్రభుత్వంలో వలే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీటీసీలు, సర్పంచులు గ్రామాల్లోని సమస్యలను వివరించారు. జడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీవో బాల్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

నందిగామ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన వీర్లపల్లి శంకర్.. తాను ఎమ్మెల్యే గెలిచిన తర్వాత మొదటిసారిగా పాఠశాలకు రావడంతో ఆయనతో పాటు చదివినవారు, ప్రస్తుత విద్యార్థులు, టీచర్లు ఘనంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. పాఠశాలలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. శంకర్ మిత్రులు గడ్డమీది యాదయ్యముదిరాజ్, దారయాదయ్య, మదన్, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, వినయ్ కుమార్, విఠల్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : కొత్త పేటలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

క్రీడలతో మానసిక ప్రశాంతత

క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ధృడత్వం లభిస్తుందని వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండలం మొదళ్లగూడలో చీకుర్తి దర్శన్, గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి కాంగ్రెస్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్‌లతో కలసి ప్రారంభించారు.

ఎట్టకేలకు కొత్తపేట జీపీ భవనం ప్రారంభం

కేశంపేట : మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం ఎట్టకేలకు జరిగింది. ప్రొటోకాల్, ఇతర కారణాలతో ఇటీవల ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు వివాదంపై చర్చించి సమస్యను పరిష్కరించారు. ఈమేరకు జీపీ బిల్డింగ్‌ను శనివారం ఎంపీ, ఎమ్మెల్యేలు సర్పంచ్ కె.నవీన్‌కుమార్, ఎంపీటీసీ పసుల మల్లేష్ యాదవ్‌లతో కలిసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. కొత్తపేట గౌడసంఘ భవనం, సంతాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభించారు. జడ్పీటీసీ విశాలశ్రవణ్‌రెడ్డి, సర్పంచ్‌లు నవీన్‌కుమార్, అంజయ్య, ఎంపీటీసీలు మల్లేష్‌యాదవ్, రాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్బ, నర్సింహయాదవ్, ఆనంద్‌కుమార్, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులున్నారు.

బెల్ట్‌షాపులను అరికట్టండి

కేశంపేట మండల కేంద్రంలో బెల్ట్‌షాపులను అరికట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లికి కేశంపేట యువజన సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. శనివారం సంతాపూర్‌లో అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేను కేశంపేట యువజన సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని తెలిపారు. యుగంధర్, రమేష్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అందరికీ సమన్యాయం



ఎమ్మెల్యే కసిరెడ్డి కి వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

ఆమనగల్లు, జనవరి 27: వెనుక బడిన మారుమూల గ్రామాలు, గిరిజన తండాలను వేగవంతంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని, కాంగ్రెస్ పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వచ్చే ఏడాది లోపు బీటీ రోడ్లు లేని అన్ని ప్రాంతాలకు రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అసంపూర్తి రోడ్లు, వంతెనల నిర్మాణం, కొత్త బీటీ రోడ్ల ప్రతిపాదనలపై శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. రోడ్లు లేని తండాలు, గ్రామాలను గుర్తించి ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మేడిగడ్డ-శంకర్‌కొండ రోడ్డులో ఉన్న వాగుపై వంతెన నిర్మాణం త్వరిత గతిన చేపట్టి, దయ్యాల బోడు తండాకు బీటీ రోడ్డు నిర్మించాలని తండా గిరిజనులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కర్మన్‌ఘాట్ లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన సౌభాగ్యదేవి జ్ఞాన యజ్ఞంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీపీలు కమ్లీమోత్యానాయక్, అనితవిజయ్, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

కోదండరాంను విమర్శించే అర్హత కేటీఆర్‌కు లేదు

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి



మహేశ్వరం, జనవరి 27 : రాజకీయ జేఏసీ చైర్మన్‌గా, టీఆర్ఎస్ అధ్యక్షుడికి సహచరుడిగా.. సమ ఉజ్జీగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి సకల జనులను ఏకంచేసి తెలంగాణ ఉద్యమాన్ని పతాక యస్థాయికి తీసుకెళ్లి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో తనదైన ముద్రవేసిన ఆచార్య కోదండరాంపై మాజీ మంత్రి కేటీఆర్ అక్కసు వెళ్లగక్కడం సరికాదని, ఆయన్ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని జిల్లా గ్రంథా లయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండరంగారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరంలో విలేకరులతో మాట్లాడుతూ కోదండరాంను తమ కోటా శాసనమండలి సభ్యుడిగా ఆమోదిస్తూ గవర్నర్ తమిళిసై తీసుకున్న నిర్ణయాన్ని పక్షపాత వైఖరి అని అంటూ కేటీఆర్ మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. తెలంగాణ ఉద్యమ ద్రోహులతో కలిసి రాష్ట్రాన్ని దివాలా తీసిన మీకు కోదండరాం గురించి మాట్లాడే కనీస అర్హత కూడా లేదని కేటీఆర్‌పై పాండురంగారెడ్డి మండిపడ్డారు.

ప్రణాళికాబద్ధంగా పల్లెల అభివృద్ధి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 27: ప్రణాళికాబద్ధంగా పల్లెలను అభివృద్ధి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి, పోల్కంపల్లి గ్రామాల్లో 64.80 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనుల శంకుస్థాపన, ముకునూరులో గ్రామ పంచాయతీ భవనం, దండుమైలారంలో అంగన్‌వాడీ భవనాలను ఆయన ప్రారంభించారు. రామోజీ ఫిలింసిటీ వద్ద నాడు వైఎస్సార్ ప్రభుత్వంలో సర్వే నెంబర్ 189లో 680 మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరీ ఇచ్చి ఇందిరమ్మ పథకం కింద ఇళ్లనుకూడా మంజూరు చేశారని అయినా ఇప్పటికీ పొజిషన్ చూపలేదని నాగన్‌పల్లిలో పేదలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. త్వరితగతిన సమస్యను పరిష్కరస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నాగన్‌పల్లిలో వడ్డెర కుటుంబాలు నివసిస్తున్న గుడిసెలకు కరెంటు సౌకర్యం లేదని విద్యుత్ శాఖ అధికారులు మీటర్లు ఇవ్వడం లేదని వడ్డెరలు ఆయన దృష్టికితేగా విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్లో సంప్రదించిన ఆయన వెంటనే మీటర్లు మంజూరు చేయాల్సిందిగా ఆదేశించారు. ఇక్కడ అంబేద్కర్ భవనానికి నిధులు ఇప్పించాలని యువకులు కోరారు. అంతేగాక ఇబ్రహీంపట్నం నుంచి నాగన్‌పల్లి, పోల్కంపల్లి మీదుగా అనాజ్‌పూర్ వరకు గతంలో ఉన్న బస్సును రద్దు చేశారని.. తిరిగి పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరగా.. ఆర్టీసీ డీఎంతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే బస్సును పునరుద్ధరించాలని ఆదేశించారు. ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ మహిపాల్, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ ఇంద్రసేనారెడ్డి, ఎంపీవో లక్పతినాయక్, సర్పంచులు జగన్, అండాలు, జ్యోతి, మల్లీశ్వరి, ఎంపీటీసీ మంగ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, జనవరి 27 : సీలింగ్, అసైన్డ్ భూముల్లో నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే ఆ భూములను పీవోటీ చట్ట ప్రకారం సంబంధిత రైతుల పేర్లను తొలగించి ప్రభుత్వపరం చేసుకోవాలని మాజీమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం మహేశ్వరం ఎంపీపీ ఆర్. సునిత అంద్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదటగా వ్యవసాయ శాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో తుమ్మలూరు ఎంపీటీసీ రాంరెడ్డి, సర్పంచ్ సురేఖలు మాట్లాడుతూ తుమ్మలూరు-మహేశ్వరం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయించాలని కోరారు. రోడ్డు పనులు నడుస్తున్న సమయంలోనే వందలాది టిప్పర్లతో తుమ్మలూరు అసైన్డ్ భూముల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, రోడ్డు అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సబితారెడ్డి మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు బనాయించడంతో పాటు ఎవరైనా అసైన్డ్ భూముల నుంచి మట్టిని విక్రయిస్తే ఆ భూములను పీవోటీ చట్ట ప్రకారం ప్రభుత్వపరం చేసకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రమైన మహేశ్వరంలోనే డంపింగ్ యార్డు లేదని ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్ సభదృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయాలని.. భూమిని సర్వేచేసి డంపింగ్‌యార్డుకు కేటాయించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులకోసం గ్రామాలకు వచ్చిన అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని సబితారెడ్డి సూచించారు. సర్పంచుల పదవీకాలం ఈ నెల 31తో ముగియనుందని, వారిని పర్సన్ ఇన్‌చార్జీలుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతానన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయుడిదెంత దుర్మార్గం?

- భార్య, ఇద్దరు పిల్లలున్నా బడిలో బాలికపై కన్ను
- ప్రేమపేరుతో అభంశుభం తెలియని చిన్నారికి మాయమాటలు
- తన వెంటతీసుకెళ్లి మెడలో పసుపుతాడు కట్టిన వైనం

కడ్తాల్, జనవరి 27 : విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్ణయమవుతుందని అంటాడో తత్వవేత్త!! ఈ గొప్ప మాటను విస్మరించిన ఆ ఉపాధ్యాయుడు దుర్మార్గానికి పాల్పడ్డాడు. భార్య, ఇద్దరు పిల్లలున్న ఆ ప్రబుద్ధుడు బడిలో ఓ 14 ఏళ్ల బాలికపై కన్నేసి.. ప్రేమ పేరుతో ఆమెకు మాయమాటలు చెప్పాడు. ఆమెను తన వెంట తీసుకెళ్లి మెడలో పసుపు తాడు కట్టాడు. ఆమనగల్లుకు చెందిన 35 ఏళ్ల ఓ ప్రైవేటు టీచర్‌దీ నిర్వాకం. ఓ బడిలో మూడేళ్లుగా పనిచేస్తున్న ఆ ఉపాధ్యాయుడు, అక్కడ తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమపేరుతో లోబర్చుకునే ప్రయత్నం చేశాడు. విషయం స్కూలు యాజమాన్యానికి తెలియడంతో అతడిని విధుల నుంచి తొలగించారు. అయినా బుద్ధి తెచ్చుకోని ఆ ఉపాధ్యాయుడు, ప్రేమ పేరుతో బాలికతో తరచూ మాట్లాడుతున్నాడు. పదిరోజుల క్రితం ఆమెను తనవెంట తీసుకెళ్లి పెళ్లి చేసుకున్నాడు. ఈ ఘటనపై స్కూలు యాజమాన్యం స్పందించింది. ఉపాధ్యాయుడి తీరు తెలియడంతో అప్పట్లోనే అతడిని పాఠశాల నుంచి తొలగించామని, సదరు విద్యార్థిని తల్లిదండ్రులకు విషయం చెప్పి, అప్రమత్తం చేశామని వెల్లడించారు. తాజాగా పాఠశాల యాజమాన్యం, విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించుకొని.. 'బాలిక-మాజీ ఉపాధ్యాయుడి పెళ్లి' విషయంలో స్కూల్‌కు ఎలాంటి సంబంధం లేదని వారితో పత్రం రాయించుకున్నట్లు తెలిసింది. కాగా, ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు. అయితే, బాలికను వంచించిన ఉపాధ్యాయుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేదల పక్షాన అలుపెరుగని పోరాటం



చెన్నయ్య సంతాప సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

యాచారం, జనవరి 27 : నిరుపేదల కడగండ్లు తీర్చడం కోసం సీపీఎం రాజీలేని పోరాటాలు చేస్తోందని, గత పాలకులు పేదల భూములను ఫార్మాసిటీ కోసం తీసుకొని వారిని రోడ్డున పడేసిందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి కె.భాస్కర్‌లు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని మేడిపల్లిలో సీపీఎం నాయకుడు గడ్డం చెన్నయ్య సంతాప సభలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సీపీఎం అనేక ఉద్యమాలు చేసి పేదల పక్షాన నిలిచిందన్నారు. పేదలకు అన్యాయం చేసిన ఏపార్టీ కూడా మనుగడ సాధించలేవన్నారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు జగన్, ఎ.మల్లేష్, థావ్‌నాయక్, జంగయ్య, వెంకటయ్య, బ్రహ్మయ్య, పి.అంజయ్య తదితరులున్నారు.

నేడు యాచారంలో ఎమ్మెల్యే పర్యటన

యాచారం, జనవరి 27 : మండలంలోని గడ్డమల్లాయగూడ, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, మాల్ గ్రామాల్లో నేడు(ఆదివారం) పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రానున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. వివిధ గ్రామాల్లో రూ.169.10కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవ్వాలని కోరారు.

బాలికలు ఆపదలోనూ ధైర్యంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయాధికారి శంకర్ శ్రీదేవి

ఇబ్రహీంపట్నం, జనవరి 27: బాలికలు ఏ ఆపద వచ్చినా ఎదుర్కొనే విధంగా సంసిద్ధులు కావాలని ఇబ్రహీంపట్నం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని ఇబ్రహీంపట్నంలోని కేజీబీవీలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నేటి సమాజంలో ప్రజలు చిన్న చిన్న విషయాలకు గొడవపడి కేసులు, కోర్టులంటూ తిరుగుతున్నారని.. డబ్బు, సమయం వృథా చేసుకుంటున్నారని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని అన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులతో చాటింగ్ లాంటివి చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు చేవెళ్ల మండలంలో
విద్యుత్ సరఫరా నిలిపివేత

చేవెళ్ల, జనవరి 27 : నేడు చేవెళ్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ మహ్మద్ జానీ మొయినుద్దీన్ తెలిపారు. చేవెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చేవెళ్ల ఫీడర్ 33కేవీలో మరమ్మతులు, విద్యుత్ స్తంభాల కింద ఉన్న చెట్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు చేవెళ్ల, ఇబ్రహీంపల్లి, దామరిగిద్ద, న్యాలట, రామన్నగూడ, సింగప్పగూడ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

కేశంపేట మండలం కొత్తపేట సబ్‌స్టేషన్ పరిధిలో..

కేశంపేట, జనవరి 27: మండల పరిధిలోని కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని కేశంపేట ట్రాన్స్ కో ఏఈ ఈశ్వర్ శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేట, సంతాపూర్, కొనాయపల్లి, పాటిగడ్డ గ్రామాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు తెలిపారు. గ్రామల వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

పన్ను వసూళ్లతో బడ్జెట్‌ను పెంచాలి



సమావేశంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్

షాద్‌నగర్, జనవరి 27: షాద్‌నగర్ మున్సిపాలిటీలో వంద శాతం పన్ను వసూలు చేసి మునిసిపాలిటీ రాబడిని పెంచుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులకు సూచించారు. శనివారం షాద్‌నగర్ మున్సిపల్ బడ్జెట్ 2023-2024 రూపకల్పనపై చైర్మన్ కె.నరేందర్, కమిషనర్ వెంకన్న, ఇతర అధికారులతో ఆమె సమావేశమయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మునిసిపాలిటీలో ప్రస్తుతం వస్తున్న రాబడిని మరింత పెంచుకోవాలని సూచించారు. ఇంటి, వాణిజ్య, తాగు నీటి పన్నులను విధిగా వసూలు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. మిషన్ భగీరథ కింద ఉచిత నల్లా కనెక్షన్లు మాత్రమే ఇచ్చామని, నల్లా ఉన్న ప్రతి వినయోగదారుడి నుంచి నెలకు రూ.100 బిల్లు వసూలు చేయాలని తెలిపారు. ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించేలా పాటుపడాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్సై



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రాఫిక్ ఎస్సై రవీందర్

కొత్తూర్, జనవరి 27: ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని షాద్‌నగర్ ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని పాఠశాలలకు పంపిస్తుంటారని, వివిధ ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా స్కూళ్లకు వచ్చే విద్యార్థులు ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు జీబ్రాక్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను అందజేశారు. హెచ్ఎం అంగోర్‌నాయక్, పోలీసిబ్బంది శ్రీరామ్, వెంకట్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను వినియోగించుకోవాలి

కడ్తాల్, జనవరి 27: సామాజిక సేవా కార్యక్రమాలలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రబాగాన నిలిచిందని, క్లబ్ సేవలను వినియోగించుకోవాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీగవర్నర్ జి.చెన్నకిషన్ రెడ్డి తన తల్లి గంగాపురం సుశీలమ్మ స్మారకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని క్లబ్ సభ్యులతో కలిసి గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు.

దివ్యాంగులు చట్టాలను వినియోగించుకోవాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, జవరి 27: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల హక్కుల పరిరక్షణకోసం అనేక చట్టాలను అమలు చేస్తున్నాయని, వాటిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎంపీ భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్డీ) రూపొందిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. దివ్యాంగులకోసం అమలవుతున్న సంక్షేమ పథకాలు అందరికీ అందేట్లు చూడాలని సూచించారు. గర్భిణీలు పౌష్టికాహారం తినడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. ఎన్‌పీఆర్డీ జిల్లా అ ధ్యక్షుడు భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శి జెర్కోని రాజు తదితరులున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



స్టడీ మెటీరియల్ అందిస్తున్న బుచ్చిరెడ్డి

చేవెళ్ల, జనవరి 27 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని గుండాల పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా చైర్మన్ స్టడీ మెటీరియల్ అందించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.వాణిశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ యాదగిరి, సర్పంచ్ ప్రణతిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు.

ప్రజల సహకారంతో కడ్తాల అభివృద్ధి

కడ్తాల్, జనవరి 27 : ప్రజల, ప్రభుత్వ చేయూత, ఉన్నత స్థాయి అధికారుల సహకారంతో కడ్తాల గ్రామ పంచాయతీని ఐదేళ్లలో ఘనసీయంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించామని కడ్తాల సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి అన్నారు. సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కడ్తాల జీపీ కార్యాలయంలో శనివారం పంచాయతీ పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వార్డు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా తీర్మానాలు చేశారు. వార్డుసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టిఫిన్ బాక్సులు అందజేత

మొయినాబాద్ రూరల్, జనవరి 27: హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు మాల ఎల్లేష్ శనివారం సొంత డబ్బుతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 100 టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు. హెచ్ఎం రాములు, నాయకులు కట్టమీది ప్రకాష్, నవీన్‌గౌడ్, బి.రాజు, తదితరులున్నారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ



మాడ్గుల, జనవరి 27 : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌చారి, గౌరవాధ్యక్షుడిగా జంగయ్య, కోశాధికారిగా భిక్షపతి, మహిళ అధ్యక్షురాలిగా రేణుక, ఉపాధ్యక్షులుగా లక్కు నాయక్, జిల్లా కార్యవర్గం సభ్యులుగా వెంకటయ్య, లక్ష్మయ్య, జగన్, సరస్వతి, కృష్ణా, శ్రీకాంత్, అమర్చంద్ ఎన్నికయ్యారు.

ఎంపీడీవోకు సన్మానం



ఆమనగల్లు, జనవరి 27: పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నేనావత్ పత్యానాయక్, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు నిట్ట నారాయణలు అన్నారు. ఆమనగల్లు ఎంపీడీవో పారుఖ్‌హుస్సెన్ జిల్లాస్థాయిలో ఉత్తమ ఎంపీడీవోగా ఎంపికయ్యాడు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

సంక్షిప్తంగా..

- **కందుకూరు** : ప్రపంచ మేధావి థామస్ అల్వా ఎడిసన్ కార్మికులకు ఆదర్శప్రాయుడని టీపీఈటీఎఫ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ్రపల్లి జగన్ అన్నారు. శనివారం ఎలక్ట్రీషియన్ డేను పురస్కరించుకొని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు గాదె సత్తయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కందుకూరు, మహేశ్వరం మండలాలకు సంబంధించిన కార్మికులతో ఎలక్ట్రీషియన్ డేవేడుకలను జరుపుకున్నారు. ప్రభుత్వం ఎలక్ట్రీషియన్ కార్మికులకు అందిస్తున్న రూ.10లక్షల ఇన్సూరెన్స్‌ను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘం నాయకులు గాదె చెన్నయ్య, మాదిరెడ్డి, సంజయ్, రాథోర్డు, ప్రవీన్, సాయికిరణ్, వినోద్, శ్రీకాంత్, రాజు, రామస్వామి, గాదె శ్రీధర్ తదితరులున్నారు.
- **కడ్తాల్** : మంత్రి దనసరి సీతక్కను మండల కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేడారం సమ్మక్క-సారక్క జాతర బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రిని కడ్తాల మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు రాంచందర్ నాయక్, సీనియర్ నాయకులు సత్యంయాదవ్, రమేశ్ నాయక్‌లు కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మండలంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.
- **మాడ్గుల** : చెనిగలగుట్ట తండా, గిరికొత్తపల్లి, పకీర్ తండా, జయరామ్ తండా, నల్లవారిపల్లి, కొత్తబ్రాహ్మణపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎస్సార్పీ వెంకన్న, సర్పంచ్ మాలతి కృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.
- **షాబాద్/చేవెళ్ల** : ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దామర్లపల్లి సర్పంచ్ బి.లింగం తెలిపారు. షాబాద్ మండలం దామర్లపల్లిలో పట్నం మహేందర్‌రెడ్డి ఆసుప్రతి వారి సహకారంతో గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఆసుప్రతి వైద్యులు, సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.
- **కేశంపేట** : కేశంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో తెలుగు విభాగంలో ఎక్లాస్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దీపిక, రామ్‌చరణ్, అక్షిత విద్యార్థులు ప్రథమ బహుమతి, ఆంగ్ల మాధ్యమంలో కేశంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అంజలి, వరుణ్, అమీనా విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల విభాగంలో కేశంపేట గ్లోబల్ పాఠశాల విద్యార్థులు తేజశ్రీ, సమ్మెక్, శరణ్య ప్రతిభ చాటారు అనంతరం వారికి కేశంపేట జీహెచ్ఎం విద్యావతి ప్రశంస పత్రాలు అందించారు.

శంకర్‌పల్లి : పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి టీయూటీఎఫ్-2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. టీచర్లు రఘునందన్‌రెడ్డి, తాహేర్ అలీ, సుదర్శన్, శ్రీనివాస్‌చారి, రాము, మునీర్‌పాషా, మహేశ్వర్‌రావు, రాములు, దాసు, సత్తయ్య తదితరులున్నారు.

- **కడ్తాల్** : గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కడ్తాల మండల గౌరవాధ్యక్షుడు కడారి రామకృష్ణ, అధ్యక్షులు క్యామ చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు. జీఎంపీఎస్ నాయకులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు.
- **ఆమనగల్లు** : బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ సెల్ సమావేశం శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగింది. ఆమనగల్లు పట్టణం నుంచి బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు సయ్యద్ ఖలీల్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు తరలి వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతం తదితర విషయాలపై చర్చించినట్లు సయ్యద్ ఖలీల్ తెలిపారు.
- **ఆమనగల్లు** : ఆమనగల్లు హౌస్ పేయింటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమనగల్లు పట్టణంలో సంఘం నాయకులు సమావేశమై తమ సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వస్పుల మహేశ్, ఉపాధ్యక్షులుగా గత్తరి మహేశ్, ప్రధాన కార్యదర్శిగా వడ్త్యావత్ లక్ష్మణ్, కోశాధికారిగా పాతకోట వెంకటేశ్, సభ్యులుగా సయ్యద్, మస్తాన్, శేఖర్, నందు, దేవ, జంగయ్య, చంద్రయ్య, మహేశ్‌లు ఎన్నికయ్యారు.
- **ఆమనగల్లు** : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి ఏడాది పూర్తి అయిన సందర్భంగా శనివారం హైదరాబాద్ ఎన్‌టీఆర్ భవన్‌లో పెద్దఎత్తున విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారంతా ఎన్‌టీఆర్ ట్రస్ట్ భవన్‌కు బయలు దేరి వెళ్లారు.